క్లుప్తంగా

ఎంపీకి వినతి

మహబూబాబాద్: స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం భాషా పండిత జేపీసీ ఆధ్వర్యంలో భాషా పండితుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీ మాలోత్ కవితకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆసంఘం నాయకులు రమేష్, శ్రీనివాస్ మాట్లాడారు. భాషా పండితులను అప్‌గ్రేడేషన్ చేయాలని డిమాండ్ చేశారు. పదోన్నతులతో పాటు సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పద్మావతి, మహేశ్వరి, దుర్గయ్య, వీరభద్రం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు అందించాలి

బయ్యారం: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించిన రైతులకు త్వరగా డబ్బులను ఖాతాల్లో జమ చేయాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండలంలోని వెంకట్రాంపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ధాన్యం డబ్బులు సకాలంలో అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

నాగర్ కర్నూల్ వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు



కురవి: నాగర్ కర్నూల్‌లో నిర్వహించిన దళిత గిరిజన ఆత్మగౌరవ దండోరా సభకు కురవి మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆదివారం వెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజనీకాంత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆదాము, కామిండ్ల వీరన్న, కొర్ని అనిల్, నమిల ప్రసాద్, రాయల నరేష్ పాల్గొన్నారు.

ఆస్పత్రికి వృద్ధుడి తరలింపు



డోర్నకల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆదివారం అపస్మారకస్థితికి చేరుకున్న వృద్ధుడు(65)ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మూడో నంబర్ ప్లాట్‌ఫారంపై గుర్తు తెలియని వృద్ధుడు అపస్మారకస్థితిలో పడి ఉండటంతో స్టేషన్ సూపరింటెండెంట్ 108కు సమాచారం అందించారు. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసుల సాయంతో 108 సిబ్బంది వృద్ధుడిని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, వృద్ధుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియరాలేదు.

సమస్యలు పరిష్కరించాలి

బయ్యారం: భవన నిర్మాణరంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లకంటి సూర్యం డిమాండ్ చేశారు. ఆదివారం బయ్యారంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 20 లక్షల మంది భవన నిర్మాణరంగ కార్మికులు ఉంటే వీరిలో 8 లక్షల మంది కార్మికులకు లేబర్‌కార్డులు లేవన్నారు. లేబర్ కార్డులు లేక లక్షలాదిమంది కార్మికులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందటం లేదన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో నాయకులు క్రిష్ణ, నాగరాజు, వినయ్, వెంకటేష్, విజయ్, మురళి, వెంకట్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నెహ్రూసెంటర్: తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘ కార్యాలయంలో ఆదివారం కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కల్లుగీత కార్మికులకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. వృత్తి పనిలో భాగంగా ప్రమాదాలు జరిగితే ఎక్స్‌గ్రేషియా, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి 560 జీఓ ప్రకారం చెట్ల పెంపకానికి ప్రభుత్వం భూమి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బబ్బూరి ఉప్పలయ్య, పానుగంటి వీరస్వామి, గుదే వెంకన్న, బొమ్మెర శ్రీకాంత్, రామన్న, తండా రాములు, మేకపోతుల అంజయ్య, శీలం సత్యనారాయణ, లింగన్న, కొత్త అంతయ్య, గందసిరి శ్రీనివాస్, మొగుళ్ళ యాకన్న, గండి వెంకట్, నారాయణ, ఉపేందర్, నాగేశ్వర్‌రావు, సోమయ్య పాల్గొన్నారు.

పేదలపై ఆర్థిక భారం

- లబోదిబోమంటున్న దరఖాస్తుదారులు
- జీఓ 59 శాపంగా మారిందని ఆవేదన



ఆందోళన చేస్తున్న బాధితులు (ఫైల్)

మహబూబాబాద్: ప్రభుత్వ భూముల్లో పేదలు నిర్మించుకున్న గృహాలను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం జీఓ 58, 59 విడుదల చేసిన విషయం విదితమే. కానీ, జీఓ 59లో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు లక్షలు చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో తమకు న్యాయం చేయాలని ఆందోళన బాట పట్టారు.

జిల్లాలో జీఓ 58 క్రింద 5,401 దరఖాస్తులు రాగా జీఓ 59 క్రింద 1,800 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. 80గజాల లోపు అయితే జీఓ 58 వర్తిస్తుంది. 2014 లోపు ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి జీఓ 58 క్రింద క్రమబద్ధీకరణ చేసేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదల చేసింది. జిల్లాలో 18బృందాలతో సర్వే చేయించారు. మే 31 వరకు సర్వే నిర్వహించారు. జీఓ 58 క్రింద జిల్లాలో 5,401 దరఖాస్తులు రాగా దానిలో మానుకోట మున్సిపాలిటీ నుంచే 5,000 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సర్వేలో ఇంటి నంబర్, విద్యుత్, నల్లా కనెక్షన్, ఆధార్ కార్డు ఇతరత్రా వాటిని పరిశీలించి ఆ జీఓ యాప్‌లో నమోదు చేశారు. ఇంటిఎదుట ఫొటోతీసి తహసీల్దార్ లాగిన్‌లో అప్‌లోడ్ చేశారు. దానిప్రకారం ఉచితంగా పట్టాలు హక్కులు కల్పించాలి. కానీ, రెండు లేక మూడు గజాలు ఎక్కువగా ఉన్నా వాటిని జీఓ 59 క్రింద పరిగణలోకి తీసుకోవడం వల్ల దరఖాస్తుదారులు నష్టపోవాల్సి వచ్చింది.

జీఓ 59లో 1,800 దరఖాస్తులు..

2014 జూన్ 2 కంటే ముందు ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని 125 గజాల కంటే ఎక్కువ ఉంటే ఈ జీఓ క్రింద వస్తుంది. 125 నుంచి 250గజాలు ఉంటే అక్కడ ఉన్న మార్కెట్ విలువలో 25 శాతం 250 గజాల నుంచి 500గజాల ఉంటే 50 శాతం అంత కన్నా ఎక్కువ ఉంటే మార్కెట్ విలువలో వంద శాతం చెల్లించాల్సి ఉందని గైడ్‌లైన్స్‌లో ఉంది. అందుకు ఏడు టీంల ద్వారా ప్రతి టీం లీడర్ జిల్లా స్థాయి అధికారితో ఈఏడాది 21–09–2022 నుంచి సర్వే చేశారు. 59 జీఓ యాప్‌లో నివాసం, ఆధార్ ఇతరత్రా ఆధారాలతో పాటుగజాలు మార్కెట్ విలువను కూడా నమోదు చేశారు.

నోటీసులు జారీ

దరఖాస్తు చేసుకున్న వారికి రెండు రోజుల నుంచి నోటీసులు జారీ చేస్తున్నారు. దానిలో ఒక్కొక్కరు పది లక్షల పైనే చెల్లించాలని నోటీస్‌లో ఉండడం గమనార్హం. ఇల్లు అమ్మినా ఆనోటీస్‌లో పేర్కొన్న డబ్బుల్లో సగం కూడా రావని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీపీఐ ఆధ్వర్యంలో పలువురు బాధితులు డిసెంబర్ 24న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. నోటీస్‌లను రద్దు చేసి నామమాత్రంగా చెల్లించి క్రమబద్ధీకరణ చేసే అవకాశం కల్పించి పేదలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఇల్లు అమ్మినా అన్ని డబ్బులు రావు



కాలనీలో ప్రభుత్వ భూమిలో 184 గజాల్లో చిన్న ఇల్లు నిర్మాణం చేసుకున్నాం. జీఓ 59లో దరఖాస్తు చేసుకోగా రూ.14 లక్షలు చెల్లించాలని నోటీస్ ఇచ్చారు. ఉన్న ఇల్లు అమ్మినా అన్ని డబ్బులు రావు.

– వెంకటమ్మ, కొండపల్లి గోపాల్‌రావు నగర్ కాలనీ, మానుకోట

నోటీస్‌లు రద్దు చేయాలి



జీఓ 59లో దరఖాస్తుదారులకు లక్షలలో చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. వాటిని రద్దు చేయాలి. నామమాత్రంగా చెల్లించే విధంగా అవకాశం కల్పించాలి. పేదలకు న్యాయం జరిగేంత వరకు పార్టీ పోరాడతాం.

– అజయ్‌సారథిరెడ్డి, సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్

నోటీసులు మా నుంచి ఇవ్వలేదు

మా కార్యాలయం నుంచి నోటీస్‌లు ఇవ్వలేదు. ప్రభుత్వ పరంగా ఆడబ్బులు చెల్లించే విషయంలో ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదు. మార్కెట్ విలువ ప్రకారం చెల్లించాల్సి వస్తుంది. ఆ నోటీస్‌లను పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

– నాగభవాణి, తహసీల్దార్

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్: పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులోని శనిగపురం శివారు భట్టుతండాలో రూ.5లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారన్నారు. బంగారు తెలంగాణే లక్ష్యంగా సీఎం ముందుకు పోతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని దేశంలోనే నెంబర్ వన్ సీఎం కేసీఆర్ అని కొనియాడారు. మానుకోట మున్సిపాలిటిలో ఇప్పటికే కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి అయి మానుకోట రూపురేఖలు మారాయన్నారు. ఇటీవం మానుకోట జిల్లా వచ్చిన సీఎం కేసీఆర్ మానుకోట మున్సిపాలిటి అభివృద్ధికి రూ 50 కోట్లు మంజూరి చేశారని వాటితో మిగిలిన అన్ని పనులు పూర్తి అవుతాయన్నారు. ఇదిలా ఉండగా.. క్యాంపు కార్యాలయంలో ఆదివారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను 31మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందచేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్‌ఫరీద్, నాయకులు గద్దె రవి, మార్నెని వెంకన్న, చిట్యాల జనార్దన్, వార్డు కౌన్సిలర్ హరిసింగ్, రంజిత్, అశోక్, వెంకట్‌రెడ్డి, బిక్కు, శ్రీను పాల్గొన్నారు.

పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మించాలి



గార్లలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గార్ల: పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రాంపురం, మద్దివంచ పంచాయతీల గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం కల్పించాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పలుమార్లు తమ పార్టీ ఆధ్వర్యంలో పాకాల ఏటి వద్ద ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టి, గార్ల నుండి 2 సార్లు మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టినా నేటికీ పాలకులు, అధికారుల్లో చలనం రాకపోవడం విచారకరం అన్నారు. ప్రతీఏటా వర్షాకాలంలో 3 నెలల పాటు రాంపురం, మద్దివంచ పంచాయతీల గ్రామాల ప్రజలు నిత్యావసరాలు తీర్చుకునేందుకు కూతవేటు దూరంలో ఉన్న మండల కేంద్రమైన గార్లకు రావాలంటే పాకాల ఏరు చెక్‌డ్యాం పై నుంచి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాలేక, పక్క మండలాలైన డోర్నకల్, బయ్యారానికి వ్యయప్రయాసాలకు ఓడ్చి ఆటోల ద్వారా వెళ్తూ నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా మంత్రి సైతం బ్రిడ్జి నిర్మాణం కోసం కృషి చేస్తామని పలుమార్లు ప్రజలకు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణంకు నిధులు విడుదలయ్యేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, పోతుల నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



డోర్నకల్: సాయం అందజేస్తున్న ఫొటోగ్రాఫర్స్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారు బోడతండాలో మృతి చెందిన బానోత్ బాల్యా, ఇస్లావత్ శ్రీను కుటుంబాలను ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ఆదివారం పరామర్శించి ఓదార్చారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ నాయిని రంజిత్, మున్సిపల్ చైర్మెన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మెన్ మహ్మద్ ఫరీద్, మార్నేని వెంకన్న, గద్దె రవి, చిట్యాల జనార్దన్, గోగుల రాజు, బానోత్ హరిసింగ్, ఎల్లండి వెంకట్‌రెడ్డి, పద్మం ఉపేంద్రమ్మ, గుగులోత్ రాజునాయక్, తోట మల్లయ్య, గుగులోత్ రాములు నాయక్, లక్ష్మణ్, రఘు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

డోర్నకల్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఫొటోగ్రాఫర్ వడ్డె శ్రీనివాసరావు కుటుంబానికి మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం కొత్త కమలాపురంలో నిర్వహించిన శ్రీనివాసరావు సంస్మరణ సభలో రూ.22 వేలు అందించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్స్ ప్రతినిధులు జి.లింగమూర్తి, ముద్దం భాస్కర్, పోటు శేఖర్, కొలిపాక పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు వార్డు సభలు

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 22, 36 వార్డుల పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ఈ నెల 24న బహిరంగ వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారధిరెడ్డి, 36వ వార్డు కౌన్సిలర్ నీరజారెడ్డి ధర్మన్న ఆదివారం తెలిపారు. తహసీల్దార్ నాగభవాని సమక్షంలో స్థానిక షాదిఖానాలో ఉదయం 10.30 గంటలకు ఎంపిక ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారు మాత్రమే పాల్గొనాలని, నిబంధనల మేరకు తహసీల్దార్ సమక్షంలో పార దర్శకంగా ఎంపిక జరిగేలా చర్యలు తీసుకుంటామని అజయ్‌సారధిరెడ్డి తెలిపారు.

అంబేడ్కర్ ఫొటోను గౌరవించాలి



మాట్లాడుతున్న కిషన్‌నాయక్

నెహ్రూసెంటర్: జనవరి 26 గణతంత్ర వేడుకల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి గౌరవించాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ కిషన్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా, కుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ చిత్రపటాన్ని గౌరవించే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం, కుల, మతాలకు అతీతంగా హక్కులను కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని ఆయనను గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ల పీరయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, పీవైఎల్ జిల్లా కార్యదర్శి పైండ్ల యాకయ్య, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు కొప్పుల రమేష్, డీబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోలెపాక వెంకన్న, రషీద్, శ్రీను, భూద్యానాయక్, గాడిపెల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కేసముద్రం: ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు



నెల్లికుదురు: 45ఏళ్లనాటి విద్యార్థులు



దంతాలపల్లి: నాటి గురువులతో విద్యార్థులు

కేసముద్రం: కేసముద్రంవిలేజ్ జెడ్పీఎస్‌ఎస్‌లో 1988–89కి చెందిన 7వ తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. గౌరవ అధ్యక్షుడు, నిజాంపేట కార్పొరేటర్ బాలునాయక్, గురువులు సంక బద్రినారాయణ, వెంకటాద్రిరెడ్డి, హిందూమూర్తి, మల్లయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం జగన్మోహన్ రెడ్డి, బండారు నరేందర్, పూర్వవిద్యార్థులు వాంకుడోతు బాలాజీనాయక్, సరితారెడ్డి, శోభారెడ్డి, నర్మలారెడ్డి, మంజుల, పుష్పలత, కొలిపాక వెంకన్న, సాంబయ్య, రాజేంద్రాచారి, శ్రీనివాస్, వీరన్న, మహేందర్ పాల్గొన్నారు.

45ఏళ్లనాటి మిత్రులు..

నెల్లికుదురు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 1978 నుంచి 1983వరకు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. 45 ఏళ్ల జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.

దంతాలపల్లి: మండల కేంద్రంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 సంవత్సరం పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చదువు చెప్పిన గురువులకు తమ జ్ఞాపకార్థంగా వెండి బిల్లలు అందజేశారు. సోమిరెడ్డి, రాములెడ్డి, విజయకుమార్, లలిత, లక్ష్మి, పూర్వ విద్యార్థులు పూర్ణచందర్, సంపత్, యాకన్న, అశోక్, శ్రీను, సూర్యకళ, రత్నకుమారి పాల్గొన్నారు.

వైభవంగా చండీ సప్తశతీ యాగం



యాగంలో పాల్గొన్న భక్తులు

మమబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రం శివారు అనంతాద్రి సమీపంలోని శ్రీ విఘ్నేశ్వరసహిత శ్రీఅష్టలక్ష్మీ దేవాలయ ట్రస్టు ఆధ్వర్యంలో చండీ యాగం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు రంగావఝుల సుధాకరశాస్త్రీ, చిట్ల శ్రీకాంత్ శర్మ వేదమంత్రాలతో దుర్గాదేవి అమ్మవారిని కొలువుదీర్చి అష్టోత్తర శతకలశాలతో చండీ అమ్మవారి సప్తశతీ యాగం నిర్వహించారు. కర్లపాటి నారాయణమూర్తి ఆధ్వర్యంలో 108 మంది భక్తులు అష్టలక్ష్మీ స్తోత్ర పారాయణం చేశారు. నూతనంగా నిర్మిస్తున్న అమ్మవారి దేవాలయ కమిటీ అధ్యక్షుడు వేమిశెట్టి మధు, కార్యదర్శి కనుమర్లపుడి వెంకటేశ్వర్లు, కోశాధికారి జంగాల భాస్కర్ ఆధ్వర్యంలో దంపతులు చండీ అమ్మవారి సప్తశతీయాగంలో పాల్గొని ఆహుతులు సమర్పించారు.

ఆహ్లాదం..



మరిపెడ రూరల్: మరిపెడ మండలం బీచ్‌రాజ్‌పల్లి ప్రధాన రహదారిలో ఇరువైపుల నాటిన హరితహారం మొక్కలు ఏపుగా పెరిగాయి. దారి పొడవున పచ్చదనంతో దర్శనమిస్తు ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

జలకళ..

మహబూబాబాద్ రూరల్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువలన్నీ జలాలతో కళకళాడుతూ కనిపిస్తున్నాయి. సుమారు 20 రోజుల క్రితం వరకు కాల్వల్లో నీరు లేక రైతులు యాసంగి పంటల సాగు చేయాలని ఆందోళనకు గురయ్యారు. ఈక్రమంలో శనివారం అధికారలుఉ ఎస్సారెస్పీ జలాలను విడుదల చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బ్రిజ్ భూషన్‌ను కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యాకయ్య

నెహ్రూసెంటర్: భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్ శరణ్‌సింగ్‌ను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా కార్యదర్శి పైండ్ల యాకయ్య అన్నారు. పీవైఎల్, పీడీఎస్‌యూ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పైండ్ల యాకయ్య మాట్లాడుతూ.. రెజర్లను లైంగిక వేదింపులకు గురిచేస్తున్న బ్రిజ్ భూషన్ అరాచకాలకు నిరసనగా రెజర్లు ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నిరసనలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. నైతిక విలువలు, ధర్మం, మతం అంటూ దేశాన్ని పరిపాలిస్తూ ప్రజల్లో విద్వేశాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. క్రీడాకారులపై జరుగుతున్న లైగింక దాడులు అధికారబలంతో దేశానికి అపకీర్తిని తెచ్చేలా పార్లమెంట్ సభ్యుడే ఇలాంటి వేదింపులకు పాల్పడతున్న భూషన్‌పై నిర్భయ కేసు నమోదు చేసి, పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు చేపట్టాలన్నా రు. ఈ సమావేశంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కార్యదర్శి ఈర్ల వెంకన్న, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఇరుగు అనిల్, జిల్లా సహాయ కార్యదర్శి కందాల రంగయ్య, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శిభూక్య సంతోష్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



పంటపొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు

చిన్నగూడూరు: మండలంలోని చిన్నతండా(లాక్య తండా) శివారులోని పంట పొలాల్లో విద్యుత్ తీగలు యమపాశంగా మారాయి. దీంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గత కొన్ని రోజులుగా విద్యుత్ తీగలు పంటపొలాల్లో వేలాడుతూ దర్శనమిస్తున్నాయి. పంటపొలాల్లో విద్యుత్ తీగలు ఎప్పుడు తెగి మీద పడతాయోనని రోజు దినదిన గండంగా గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం పొంచి ఉందని పలుమార్లు విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవడంలేదని స్థానిక రైతులు తెలుపుతున్నారు. వేలాడుతున్న విద్యుత్ తీగలతో పాటు స్తంభాలు వరిగి ఉండి ఈదురు గాలులకు ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం



పర్వతగిరి : మండలంలోని అన్నారం గ్రామంలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొనగా అర్చకులు కుంకుమ పూజా, అన్నపూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.